# అమెరి'కులాసా' కథలు

– వంగూరి చిట్టెన్ రాజు





## -26-

## ఇండియా వీసా – ఎంతో ప్రయాస

**మొన్నీ మధ్య** అత్యవసరంగా మా ఆవిడా, అమ్మాయీ అర్జంటుగా ఇండియా వెళ్ళ వలసి వచ్చింది. ఇండియా వెళ్ళడం ఎంత కష్టమో రావడం కూడా అంతే కష్టం అని మాకు మరొక సారి తెలిసి వచ్చింది. నేను అమెరికా వచ్చిన కొత్తలో ...అంటే విమానం టిక్కెట్లు కాగితాల మీదే కార్బన్ పేపర్ పెట్టి టైపు కొట్టి ఇచ్చే రోజుల్లోనూ, టెలిఫోన్ సదుపాయాలు అక్కడక్కడా మాత్రమే ఉండే రోజులూ, కంప్యూటర్ అనేది ఇంకా బ్రహ్మ పదార్థం గానూ, బొంబాయి, ఢిల్లీ విమానాశ్రయాలు అగ్గి పెట్టెల సైజులో ఉండి కష్టమ్స్ వాళ్ళు మమ్మల్ని విపరీతమైన కష్టమ్స్ పెట్టి కనీసం రెండు మందు బాటిళ్ళు, ఒక త్రీ ఇన్ వన్నూ, నాలుగు పెన్నులూ, వీలుంటే పాకెట్ సైజ్ కేలుక్యులేటర్ మా సూట్ కేసుల్లోంచి లాగేసుకుని వెయ్యి రూపాయలు జేబులో పెడితే కానీ మమ్మల్ని బయటకి వెళ్ళనివ్వని రోజుల్లో ఇండియా ప్రయాణం అనగానే ఏడాది పాటు పోగేసి దాచుకున్న డబ్బు, గంటల లెక్కలో శలవు దినాలు లెక్క పెట్టుకుని నానా ప్రయాసా పడేవాళ్ళం. అయితే ఇంటికి వెళ్ళగానే అమ్మా, నాన్న గారూ, అప్ప చెల్లెళ్ళు, అన్నదమ్ములు, "నాకేం తెచ్చావ్?' అంటూ గుమిగూడిన బంధువులు, స్నేహితులు....ఇలా అందరినీ చూడగానే ఆ ప్రయాణం తాలూకు శ్రమ అంతా మర్చిపోయే వాళ్ళం. మమ్మల్ని ఫారిన్ రిటర్న్డ్ అనే వారు. ఈ ఎన్నారై అనే మాట మాకు తెలియదు.

ఇప్పుడు పరిస్థితులు మారాయి. అమ్మా, నాన్న, అన్నదమ్ములూ, అప్ప చెల్లెళ్ళు స్నేహితులు, బంధువులూ ఉన్నా మనల్ని ఫారిన్ రిటర్న్డ్ గా చూడ్డం ఎప్పుడో మానేశారు. మనల్ని ఆహ్వానించడానికి విమానాశ్రయం రావడం కూడా అపురూపమే. ఒక వేళ వచ్చినా "ఏరా, పాపం అమెరికా నుంచి వచ్చావు. ఇదిగో ఈ పాతిక వేలు ఉంచుకో. ఇక్కడ వారం ఖర్చులకి ఉపయోగ పడుతుంది" అని ఎన్నారైల బీద తనం చూసి జాలిపడే రోజులు వచ్చేసాయి. "ఎప్పుడొచ్చావ్" ఎప్పుడు వెళ్తున్నావ్?" అనే పలకరింపులు వచ్చేశాయ్. "గుడ్ టు సీ యూ, మామయ్యా, సీ యు లేటర్" అంటూ పారిపోయే రోజులు వచ్చేశాయ్. ఇప్పుడు బొంబాయి, ఢిల్లీ మొదలైన విమానశ్రయాలు టోక్యో, దుబాయ్, షికాగోలకి ఏ మాత్రం తీసిపోవు. విమానం టిక్కెట్లు ఆన్-లైన్ లో మనమే కొనుక్కోవచ్చును. అంతా కంప్యూటర్ మయమే. ఎక్కడా కాగితం ముక్క అక్కర లేదు.

ఇలా ఎన్ని మార్పులు వచ్చినా ఇండియా ప్రయాణం లో ఇబ్బందులు మటుకు తగ్గ లేదు. దానికి ఉదాహరణ మొన్నటికి మొన్న మా అమ్మాయి, మా ఆవిడా ఇండియా ప్రయాణమే. మా ఆవిడకి ఇది వరకటి ఇండియా వీసా ఇంకా పనికొస్తుంది కాబట్టి పరవా లేదు. కానీ మా అమ్మాయికి అర్జంటుగా ఒక రోజులో ఇండియా వీసా కావాలి. ఇండియా కాన్సలేట్ వారి వెబ్ సైట్ లో చూస్తే అలాంటి అర్జంటు వీసా కావలసిన వారు ఇండియా దౌత్యకార్యాలయానికి వెళ్ళి పొద్దున్న 11 గంటల లోపున $300 రుసుము కట్టి వీసాకి దరఖాస్తు చేస్తే అదే రోజు సాయంత్రం 4 గంటలకి వీసా ఇస్తారు అని సమాచారం ఉంది. ఇండియన్ కాన్సలేట్ మా హ్యూస్టన్ లోనే ఉంది కాబట్టి మా అమ్మాయి

ఆఘమేఘాల మీద అక్కడికి పరిగెట్టింది. తీరా దరఖాస్తు ఫారం పూర్తి చేసి, 300 డాలర్ల నగదు ఇవ్వగానే ముందు నవ్వు మొహం పెట్టి తరువాత అక్కడ వాళ్ళు అదోలా మొహం పెట్టారు. "మీకు వీసా ఇవ్వలేం" అని అక్కడి ఆండాళ్ మా అమ్మాయి దరఖాస్తు తిరస్కరించింది. మా అమ్మాయి చేసిన పొరపాటు ఏమిటీ అంటే ..తను అమెరికాలో పుట్టి పెరగడం..ట.

నిర్ఘాంత పోయి "మరి ఇప్పుడు ఏం చెయ్యాలీ?" అని అడిగింది మా అమ్మాయి.

"మీ తల్లి దండ్రులు పాకిస్తానీ వాళ్ళా, ఇండియా వాళ్ళా?" అని అడిగింది ఆండాళమ్మ. మా అమ్మాయి పేరులో "లక్ష్మి" అని ఉంది. నాకు తెలిసీ పాకిస్తాన్ లో లక్ష్మి పుట్టే అవకాశం లేదు.

"మా నాన్న పేరు రాజు, మా అమ్మ పేరు గిరిజా లక్ష్మి. వాళ్ళది ఫలానా అంధ్ర ప్రదేశ్ లో కాకినాడ. నా పేరులో కూడా లక్ష్మి ఉంది. ఈ కారణాల వలన నేను పవిత్ర భారత దేశం వారి సంతతినే అని మీకు అర్థం అయింది కదా, ఆండాళ్ ఆంటీ" అని మా అమ్మాయి విశదీకరించింది.

"అవును కానీ, ఈ అర్జంటు వీసా పాకిస్తాన్లో పుట్టిన వారికే కాదు, వారి సంతతికి కూడా ఛస్తే ఇవ్వం. నువ్వు భారతీయ సంతతికి చెందితే నీకు ఇస్తాం కానీ మీ అమ్మా, నాన్నల ఇండియా పాస్ పోర్ట్ లు కావాలి." ఆండాళ్ ఒకటో ఉవాచ

"వాళ్ళిద్దరూ అమెరికా వచ్చి 45 ఏళ్ళు అయింది. వాళ్ళవి అమెరికా పాస్ పోర్ట్ లు. 35 ఏళ్ల క్రితం అమెరికన్ సిటిజెన్ షిప్ తీసుకున్నాక ఇండియా పాస్ పోర్ట్ లు రద్దు అయ్యాయి. ఇప్పుడు లేవు." అంది మా అమ్మాయి.

"సరే. వాళ్ళు ఇండియాలో పుట్టినట్టు రుజువు కావాలి."–ఆండాళ్ రెండో ఉవాచ.

"అలా అని వాళ్ళ అమెరికన్ పాస్ పోర్ట్ లో ఉంటుంది కదా!" –మా అమ్మాయి రెండో సమాధానం.

"అదెల్లా ముడియాదు. వాళ్ళిద్దరి పుట్టినరోజు సర్టిఫికేట్ లు కావాలి" — ఆండాళ్ మూడో ఉవాచ.

"భలే దానివే. వాళ్ళు పుట్టినప్పుడు కంప్యూటర్లు లేవు. ఊరికి ఒక ఫోన్ ఉండేది. అలాంటి సర్టిఫికెట్లు లేవు కానీ జాతకాలు ఉన్నాయేమో?"– ఈ సారి నవ్వేసింది మా అమ్మాయి.

"సరే. వాళ్ళిద్దరికీ పెళ్లి అయినట్టు వాళ్ళ మేరేజ్ సర్టిఫికేట్ కావాలి. అదేదో ఇండియాలోనే కదా అవుత?" –అనుమానం గా ఆండాళ్ నాలుగో ఉవాచ.

"మేరేజ్ సర్టిఫికేటా? నేను ఎప్పుడూ అది చూడ లేదు కానీ ఉండే ఉంటుంది" అంది మా అమ్మాయి.

"ఆహా. గుడ్....వెళ్లి అది పట్టుకుని రా" అభయం ఇచ్చింది ఆండాళ్

అప్పటికే సమయం 11 దాటింది. ఇంటికి వెళ్లి ఆ మేరేజ్ సర్టిఫికేట్ వెతికి మళ్ళీ రావడానికి గంటన్నర పడుతుంది. మరెలా? అని మా అమ్మాయి మధనపడుతూ ఉంటే...ఆండాళ్ మళ్ళీ తన మధుర గానం వినిపించింది. ఆండాళ్ కోకి లా ఉంటుంది అని వేరే చెప్పక్కర లేదు.

"అన్నట్టు. నువ్వు వాళ్ళకే పుట్టినట్టు రుజువు కావాలి" –ఆండాళ్ ఐదో అస్త్రం.

"అంటే?"...మళ్ళీ నిర్ఘాంత పోయింది మా అమ్మాయి.

"ఆ మాత్రం తెలీదా? నీ పుట్టిన రోజు సర్టిఫికేట్ కావాలి. అందులో మీ అమ్మా, నాన్నల పేర్లూ ఉండాలి" —అండాళమ్మ జాలిగా ఆరో ఉవాచ.

అది వినగానే మా అమ్మాయికి ఒకానొక అతి ఘోరమైన అనుమానం వచ్చేసింది. ఇండియాలో అయితే ఎక్కడ చూసినా "ఫలానా శర్మ గారి నాలుగో అష్టావక్రుడు". లేదా "ఫలానా రెడ్డి గారి మొదటి జడ్డి కుమారుడు", లేదా "ఫలానా చౌదరి గారి కుంతీ కుమార్తె " అని ఎప్పుడూ తండ్రి పేరే రాస్తారు కానీ తల్లి పేరు ప్రస్తావించరు. అదే అమెరికాలో సరిగ్గా దానికి వ్యతిరేకంగా అవసరం అయితే తల్లి పేరు రాస్తారు

కానీ తండ్రి ఎవరో చస్తే కమిట్ అవరు. అంచేత బర్త్ సర్టిఫికేట్ లో కేవలం తల్లి పేరు మాత్రమే రాసే అవకాశం ఉంది. తీరా తన పుట్టిన తేదీ సర్టిఫికేట్ లో అమ్మ పేరు ఒకటే ఉండి, నాన్న పేరు లేకపోతే తనకి ఇండియా వీసా రాదేమో అనే భయం పట్టుకుని మా అమ్మాయి ఇంచు మించు మూర్ఛ పోయే స్థితికి వచ్చి నాకు ఫోన్ చేసి ఈ తతంగం అంతా చెప్పింది. నేను కూడా ఈ నిబంధనలకి ఆశ్చర్య పోయాను. కానీ, నాకు మా కాన్సలేట్ జనరల్ గారు బాగానే తెలుసు కాబట్టి ఏమన్నా సహాయం చెయ్యగలడేమో అని ఆయనకి ఫోన్ చేశాను. ఈ రోజుల్లో పాకిస్తాన్ టెర్రరిస్ట్ ల నుంచి ప్రమాదం కారణంగా వీసా రూల్స్ కాస్త కఠినంగానే ఉన్నాయి అనీ ఆయన వివరించి అమెరికన్ సిటిజెన్స్ కి ఆన్ –లైన్ లో ఎలెక్ట్రానిక్ వీసా 48 గంటల్లో వస్తుందనీ అది వినియోగించుకోమనీ సలహా ఇచ్చారు. దాంతో మా అమ్మాయి ఆండాళ్ గారి నిస్సహాయతకి తన సానుభూతి ప్రకటించి, ఇంటి కొచ్చి తన బర్త్ సర్టిఫికేట్ లో తన కన్నా తండ్రిగా నా పేరు కూడా ఉండడంతో సంతోషించిందో, నిట్టూర్చిందో ..అసలు ఏమనుకుందో తెలియదు కానీ, ఆ సమస్యకి తెర పడగానే ఆన్ –లైన్ లో వీసా సంపాదించుకుని ఒక రోజు ఆలస్యంగా తనూ, మా ఆవిడా ఇండియా వెళ్ళారు. అదే ఒక తెల్ల, నల్ల వగైరా అమెరికన్లకి అర్జంటు వీసాలు బహుశా అర్జంటుగా అర గంటలోనో లేదా 15 రోజుల్లోనే ఇస్తారేమో తెలియదు.



మొత్తానికి మా ఆవిడా, మా అమ్మాయి, డాలస్ నుంచి మా పెద్ద బావ మరిదీ మద్రాసు విమానాశ్రయంలో దిగేటప్పటికి తిరుపతిలో మా అత్త గారు పోయారు. ఆఖరి చూపులు దక్క లేదు. దేహ దర్శనం దక్కింది. మా పిల్లలు ముగ్గురికీ వాళ్ళ అమ్మమ్మ అంటే ప్రాణం. ఆవిడ మరణంతో మా కుటుంబంలో మా పై తరం అంతరించింది. నాలుగు నెలల క్రితం ఆరోగ్యం సహకరించక పోయినా మా అత్త గారు పంతం పట్టి అమెరికా వచ్చి తన ఏకైక ముని మనవరాలు....అంటే మా మనవరాలిని చూసి మనసారా ఆశీర్వదించి వెళ్లి పోయారు. ఇప్పుడు నిజంగానే వెళ్ళిపోయారు.

ఇవాళే..అంటే మార్చ్ 1 నాడే మా మనవరాలి మొదటి పుట్టిన రోజు. జీవితం అలా కొనసాగుతూ ఉంటుంది. లైఫ్ గోస్ ఆన్....

**COMMENTS**